# మాతృమూర్తి

రిక్షా దిగాను. సాయంత్రం ఆరుగంటలకే చేరవలసిన రైలుబండి అనివార్యమయిన రహదారి ఆటంకాలవల్ల మరో అయిదు గంటలు ఆలస్యం కావడంచే రాత్రి పదకొండు గంటలకు యిల్లు చేరాను. దూర ప్రయాణంచేసి వచ్చిన అలసటతో, ఆకలితో నీరసంతో కలిగిన శరీర బాధవల్ల ఇంటికి చేరుకున్నాననే సంతోషంతో "అమ్మా" అంటూ ఒళ్ళు విరుచుకుని, గట్టిగా శ్వాస పీల్చుకున్నాను రిక్షాదిగి.

ఇంటిముంగలి పెళ్ళి పందిరి విద్యుద్దీపాలతో ఆహ్వానించింది. ఆ దీపాల కాంతిలో మిలామిలా మెరుస్తున్న మామిడి తోరణాలు నా రాకకు ఆహ్లాదంగా నృత్యం చేస్తున్నట్లున్నాయి. ఆనవాలు పట్టలేని ముత్తైదువులు యువకులు పందిరిలోంచి హడావిడిగా నడిచిపోతున్నారు. వీధి అరుగు మీద నౌకర్లు, బ్యాండువాళ్ళు గుమిగూడి ఏవో కబుర్లు చెప్పుకొంటూ చుట్ట కాల్చుకుంటున్నారు. వెలుగుతున్న విద్యుద్దీపం చూట్టూ ఎన్నో పురుగులు ఎగురుతూ పందిరిలో రాలుతున్నాయి.

పది సంవత్సరాల క్రితం విడిచిన ఇంటినీ, తండ్రినీ, చెల్లిలినీ, బంధు జనాన్ని చూడగల్గుతాననే ఆనందంతో గబగబ అడుగు వేశాను. రిక్షా జాడ కనిపెట్టి ఒకముసలాయన భుజంమీద కండువా సవరించుకుంటూ గబగబ పందిరిలోకి వచ్చాడు. ఇంట్లోంచి.

"నా...న్న!" ఆ ముసలాయన్ను చూడగానే ఆనందంతో కళ్ళు చెమ్మగిలి దగ్గరగా వెళ్ళి నిలబడిపోయాను. నాన్న నా భుజంమీద చెయ్యి వేసి కౌగలించుకున్నాడు!

"కులాసాగా ఉన్నావా వేణూ!"

నా ఆనందం ఏ విధంగా వ్యక్తం చేయ్యాలో అర్థం కాక ఒక నవ్వు నవ్వాను.

అరవయి సంవత్సరాలవయస్సు వచ్చిన నాన్నలో వేలాడుతున్న బుబ్బలు, వాలుతున్న తెల్ల కనుబొమ్మలు, ముడతలు పడుతున్న శరీరం, బట్టతల, ప్రస్ఫుటమయి ఆయన రూపంలో చాలా మార్పు తెచ్చింది. పెరుగుతున్న సంసార బాధ్యతల బరువు, మనోవ్యథలు కూడా ఆయన్ని క్రుంగదీసి ఉంటాయి.

నాన్న, నేను ఆనందంగా, ఆలింగనంతో ఒకడుగు ముందుకు నడిచాము. "మీ అమ్మే ఉంటే......" నాన్న ఏదో అనబోయాడు.

"వేణూ"

వెనుదిరిగి చూశాను

పసుపు పచ్చని శరీర కాంతిలో మూర్తీభవించిన సహజమైన పెద్ద ముత్తైయిదువులా నవ్వుతూ నిలుచుంది ఆమె.

"నువ్వు......' ఆలోచిస్తూ ఆనందంతో తడబడుతూ ఏదో అనబోయాను.

"అప్పుడే మర్చిపోయావన్న మాట!" చేతులు తిప్పుకుని మూతి ముడిచింది ఆమె కొంచెం కోపంతో.

"పేరిందేవి?" నాన్న నవ్వేడు.

"ఆ! ఆ! పేరిందేవి!" నా ఆలస్యానికి నొచ్చుకుంటూ నేనూ నవ్వేశాను. "అయినా ఇంత యిలా హఠాత్తుగా మారిపోతే ఎలా ఆనవాలు పట్టడం? సన్నగా బక్కపల్చగా ఉండే మనిషివి యింత లావెక్కితే..."

"నువ్వేం తక్కువ మారావా? అద్దం తీసుకురానా?"

ప్లీడరుగారిలా ఎదురు ప్రశ్న వేసింది పేరిందేవి.

నాన్న గట్టిగా నవ్వేడు "తీరుబడిగా దెబ్బలాడుకుందురు గాని! ఇప్పుడు కాదు!" అంటూ.

పేరిందేవి ఆనందంగా నన్ను పరీక్షగా చూసి, గర్వంగా ఒక నవ్వు నవ్వింది.

"ఏయ్! చాకలి! పిల్లని ఇంట్లో పడుకోబెట్టు! కేక పెట్టింది పేరిందేవి.

చాకలాడు పందిరిలో చాపమీద పడుకున్న రెండేళ్ళ పిల్లని ఎత్తుకొని ఇంట్లోకి నడిచాడు. పేరిందేవి గబగబ నడిచి రిక్షావద్దకు వెళ్ళింది. పెట్టి బెడ్డింగు రెండూ చేతుల్తో పట్టుకుని నా దగ్గరకు వచ్చింది.

"నీ కెందుకీ శ్రమ! రిక్షావాడు తెస్తాడుగా!" అన్నా.

"నువ్వేమీ మాట్లాడ్డానికి వీల్లేదు నేను యిప్పుడు యీ ఇంటికి పెద్దను" నవ్వింధి పేరిందేవి.

ఆమాట నాకర్థంకాలేదు.

"అంతేలే" అంటూ నాన్న ఒకడుగుముందుకు వేశాడు. అప్పుడే ఇంట్లోంచి అమ్మలక్కలు, అబ్బాయిలు, ముసలాళ్ళు, చెల్లెలు, తమ్ముళ్ళు "వేణూ" అంటూ చుట్టుముట్టారు. ప్రశ్నవర్షం కురిపించారు. నాక్షేమం గురించి.

ఏయ్! ఏమిటి ప్రశ్నలు ఇంటి గుమ్మంముందు? రాబోయే పెళ్లికొడుకును విసిగించండి భార్యతో పల్లకీ దిగి వచ్చినప్పుడు’’ పేరిందేవి తన వయస్సు మరిచి ఎదురుగావున్న పెద్దలను, పిన్నలను మందలించింది.

‘రా వేణూ! నీ కెంత ఆకలేస్తోందో! భోజనంచేద్దువుగాని’’ పేరిందేవి నా చెయ్యి పట్టుకుని ఇంట్లోకి నడవమని నెట్టింది.

ఆనవాలుపట్టినా లేకపోయినా, ఆ బంధువుల కందరికీ యథోచితంగా సమాధానాలు చెప్పి మేడమీదకు వెళ్ళాను.

పేరిందేవి తన మొలలో దాచుకున్న తాళంచెవుల గుత్తితీసి ఒక గది తెరిచింది.

“ఈ గది నీ కోసం ప్రత్యేకం. ఒక్క పెళ్ళికూతురు మాత్రమే యిక్కడ అప్పుడప్పుడు ఉంటుంది’’ మొలలో తాళాలు దాచుకుంటూ నవ్వింది ఆమె.

ఆ గదిలో కొన్ని కొత్తబట్టల మూటలు, ఒక పెట్టె, చిలకకొయ్యకి తగిలించివున్న కొన్ని చీరలుమాత్రం ఉన్నాయి. గదిలోని కిటికీ ద్వారా బయటనుంచి చల్లగాలి రివ్వున వీస్తోంది.

“పదకొండు గంటలదాకా రాకపోతే నువ్వు పెళ్ళికివస్తావో, రావో, అనిభయపడ్డాం. క్రింద స్నానానికి వేన్నీళ్లు తయారుగావున్నాయి భోజనం సిద్ధంచేయిస్తా త్వరగా రా’’ అంటూ గెంతుతూ మేడ కిందకి వెళ్లిపోయింది ఆమె.

పెండ్లికూతురు ఎదురుగావచ్చి నిల్చుంది.

"ఏం! సీతా! కులాసాగా వున్నావా?" అన్నాను మామూలు ధోరణిలో. తరువాత గబుక్కున నాలికకర్చుకున్నాను. శుభమా అని పెండ్లి జరుగుతున్నట్లు ప్రత్యక్షంగా కనిపిస్తోంటే ఆమె క్షేమానికి తక్కువేమొచ్చిందని.

సీత నవ్వుతూ మౌనంగా నిల్చుంది.

"పెండ్లికొడుకు బాగున్నాడా?"

సిగ్గుతో తలవంచుకొని తలుపుచాటుకు వెళ్ళిపోయింది సీత.

నేను ఇంటినుంచి పారిపోయినప్పుడు సీతకు ఎనిమిదేండ్లు. ఇప్పుడు పద్దెనెనిమిదేళ్ళ వయస్సులో నిండు యౌవనంతో సౌందర్యంగా ఉంది. కాలం మార్పులో కనిపించే వ్యక్తులవిచిత్ర రూపాలు ఆలోచించుకుంటూ స్నానానికి మేడక్రిందకు వెళ్ళాను.

స్నానంచేసి భోజనానికి కూర్చున్నా. భోజనం వస్తువులు పెళ్ళివారి వంటకాల్లా కనిపిస్తోనే వున్నాయి. అన్నీ వడ్డించి పేరిందేవి నాప్రక్కనే పీటవేసుకుని కూర్చుంది,

"ఏమిటి కలకత్తా విశేషాలు?" ప్రశ్నించింది పేరిందేవిఉత్సాహంగా ఇంతకాలం జీవితంలో జరిగిన వింతలు గ్రహిద్దామని.

"ఏమున్నాయి" అంటూ నవ్వాను మెల్లిగా, ముఖంమీద చెమట తుడుచుకుంటూ.

"విసరనా?" అంటూ పేరిందేవి ప్రక్కనే ఉన్న తాటాకు విసనకర్రతో గట్టిగా విసరడం మొదలెట్టింది.

"గాలి బాగా వీస్తోందా?" చిలిపిగా ముఖంపెట్టింది పేరిందేవి.

నేను ఫక్కున నవ్వేను, చిన్నతనంలో జరిగిన సంఘటనలు జ్ఞప్తికి వచ్చేయి.

మేమిద్దరం ఒకే స్కూల్లో చదువుకునేవాళ్ళం. ఇద్దరి ఇళ్ళు ప్రక్కగానే వుండేవి. నేను భోజనం చేసేటప్పుడు రోజూ సాయంగా నా ప్రక్కనే కూర్చుని ఇలాగే ప్రశ్నించేది. ఒకొక్కసారి కొంటెగా వినకపోతే తలమీద కొట్టేది.

పేరిందేవికూడా గట్టిగా నవ్వింది.

"ఏం?" అన్నా.

"నువ్వు ఎందుకు నవ్వావో నేనూ అందుకే నవ్వాను."

ఆమెకూ ఆచిన్ననాటి సంఘటనే జ్ఞప్తికి వచ్చిందని నే ననుకున్నా.

ఇంటికి రాగానే ఆదరించి, మంచిగా మాట్లాడి, నా సౌకర్యాలు చూస్తూకడుపునిండా భోజనంపెట్టి పిల్లల తల్లిగా ఇరవై ఎనిమిదేండ్ల వయస్సులో నా ప్రక్కనేఉన్న పేరిందేవిని చూడగానే "నాఅమ్మ ఎవరో తెలియని నాకు మాతృదేవత సాక్షాత్కరించినట్లు కనిపించింది పదిసంవత్సరాల క్రితం అమ్మలేకపోబట్టే నా బ్రతుకు హీనమయిందని లేచిపోయాను ఇంట్లోంచి. మా అమ్మే బ్రతికిఉంటే నాకు ఇంతకంటే ఎక్కువ ఆదరణ లభించేదా? పేరిందేవిలో అచ్చు మీ అమ్మ పోలిక లన్నీ ఉన్నాయిరా అన్న నాన్నమాటలు జ్ఞప్తికి వచ్చాయి.

"పిల్లలా?" ప్రశ్నించాను.

"ముగ్గురు"

నేను నవ్వాను గట్టిగా.

"నువ్వూ పెళ్ళిచేసుకొని ఉంటే ఈపాటికి తాతగారయ్యే వాడివిగా పేరిందేవి హేళనగా వెక్కిరించింది, ఈవిషయం ప్రస్తావన మార్చాలనుకున్నాను.

"ఈ ఇంటి పెద్దరికం నీ చేతుల్లోకి ఎల్లావచ్చింది?"

ఇప్పుడు పెళ్లిలో కన్యాదానం చేసేవాళ్ళే వరనుకున్నావు?" గర్వంగా ఠీవిగా ముఖం పెట్టింది పేరిందేవి.

పెండ్లిపీటలమీద నాకు మాతృదేవతగా ఒక స్థానాన్ని ఆమె ఆక్రమించబోతోందని గ్రహించాను.

"విశేషాలు అడిగావు కదూ!...కలకత్తా అంతా వెదికాను. పేరిందేవి లాంటి మనిషి ఎక్కడా కనిపించలేదు"

"ఇంటినే మర్చిపోయిన మనిషికి దూరపు చుట్టమైన పేరిందేవి జ్ఞాపకం ఉందంటే ఎవరు నమ్ముతారు?"

పేరిందేవి విసరడం మానేసింది. పెరుగు వడ్డించింది.

"మేడమీద పక్క వేయించాను. కాస్సేపు విశ్రాంతి తీసుకో!!... తెల్లవారుఝామున మూడుగంటలకు ముహూర్తం...నిద్రపోయావు గనుక. చూసుకోవలసిన పెళ్ళి పనులు బోలెడువున్నాయి" అంటూ పేరిందేవి చెంగున నడుస్తూ వెళ్ళిపోయింది.

ఇంటివరండాలో కొల్లలుగా నిండిఉన్న కొందరు బంధుజనం ఏవో గుస గుస చెప్పుకుంటున్నారు నన్ను గురించి. ముసలాళ్ళు గోడకు జేరబడి జోగుతున్నారు;

భోజనం ముగించి వరండాలోకి రాగానే గుసగుసల సద్దులు అణగి పోయాయి కాని బంధువుల కళ్ళు మాత్రం నాకేసి తీవ్రంగా ఒక సారి విమర్శ చేశాయి. మేడమీదకుపోయి పడుకున్నా. విశ్రాంతికోసం ఒంటరి తనంలో స్నేహితుడైన సిగరెటును ప్రజ్వలితం చేశాను.

సిగరెట్టు పొగలు గాలిలో గత జీవితంనాటి నా కలలుగా తేలి పోతున్నాయి.

నేను పుట్టగానే మా అమ్మ చనిపోయింది. నా జననం మా అమ్మ మరణానికి కారణమయిందని నన్ను నా తల్లి తాలూకు బంధుజనం అంతా ఈసడించారు. అమ్మ అంటే ఏంతో అనురాగమున్న నాన్న మళ్ళీ పెళ్ళి చేసుకోనని ప్రతిన పట్టారు. నన్ను పెంచి పెద్దచేసే భారం నాన్న మీదే పడింది.

తల్లి మరణానికి కారకుడైన నన్ను ఏ తల్లి అదరించడానికి యిష్ట పడలేదు. నా పెంపకంమీద ఏ విధంగా శ్రద్ధచూపాలో తెలియని నాన్న ఒక దాసీని నియోగించారు. ఆమె పాలిచ్చి పోషించేది.

ఒకరోజు నాన్న వూళ్ళోకి వెళ్ళారు పనిమీద ప్రొద్దున్నే. మధ్యా హ్నం పన్నెండు గంటలకు ఇంటికి తిరిగివచ్చారు. వోరగా వేసివున్న తలుపు తెరచారు ఎదురుగాఉన్న దృశ్యం చూసి చకితులైపోయారు నాకు పాలిచ్చే దాసి నురగలు క్రక్కుతూ పడివుంది. ఆమె ప్రక్కనే బోర్లపడి నేను ఆడుకుంటున్నా. ప్రక్కనే నల్లత్రాచు పడగ ఎత్తి నుంచుంది.

తెరిచే తలుపు కిర్రు శబ్దం, పాదరక్ష చప్పుడువిన్న ఒక నిముషం తర్వాత మెల్లిగా పడగ ముడుచుకొని త్రాచు ఎక్కడికో చరచర పరుగెత్తింది. నాన్న గబగబ వచ్చి నన్ను ఎత్తుకున్నాడు. దానికి యథావిధిగా దహనక్రియలు చేయించాడు.

తన కడుపు నింపుకోడానికి నన్ను పెంచుదామని తల్లిస్థానం ఆక్రమించిన దాసీకూడ చనిపోవడం మాచుట్టుప్రక్కలఇళ్ళల్లో పెద్ద కథగా ప్రచారమైపోయింది. పొరుగింటి స్త్రీలు నన్ను ముట్టుకోడానికే భయపడేవారు. చివరకు నాన్నే స్వయంగా నా పెంపక భారం నిర్వహించసాగారు.

అయిదు సంవత్సరాల వయస్సులో నేను బయటబాగా తిరుగుతూ, పిల్లలతో దెబ్బలాడుతూ, పొరుగింటివారి పితూరీలతో నాన్నకు విసుగెత్తించేవాడిని. ఒకరోజు దాగుడుమూత లాడుకుంటూంటే పేరిందేవితో పరిచయం కలిగింది. ఆటలో ఏదో కోపమువచ్చి పేరిందేవిని కొట్టాను. తిన్నగా వచ్చి నాన్నతో ఫిర్యాదు చేసింది పేరిందేవి.

"తప్పు! యీ అమ్మాయి నీకు చెల్లెలవుతుంది" నాన్న నన్ను మందలించాడు.

"చెల్లాయి?" నవ్వాను.

ఏడుస్తున్న పేరిందేవి కూడా నవ్వింది.

"ఇంక ఎప్పుడూ కొట్టనే" అన్నా పేరిందేవి చెయ్యి పట్టుకుని

నాన్న ఆనందంగా నవ్వుకున్నాడు మమ్మల్ని చూసి, మా ఇంటి ప్రక్కనే ఉన్న కనకమ్మగారి కూతురు పేరిందేవి. నేను పుట్టిన తొమ్మిది

నెలల తర్వాత జన్మించింది. ఒకే వయస్సులో ఉన్న మా యిద్దర్కికీ స్నేహం బాగా పెరిగింది. దూదుంపుల్ల, పరుగు పందాలు, దాగుడుమూతలూ ఆడుకునే వాళ్ళం. ఒకేస్కూల్లో చదువుకునేందుకుచేరాము, ఇద్దరూకలిసి బడికి వెళ్ళేవాళ్ళం. కాస్త తీరిక ఉంటే తిన్నగా పేరిందేవి మా యింటికి వచ్చేసేది.

మొదటి రోజుల్లో నాన్నే స్వయంగా నాకు వండిపెట్టేనారు. తర్వాత వంటవాణ్ణి నిర్ణయించారు. వంటవాడు వెళ్ళిపోతే, నేనుఒంటరిగా భోంచేసేటప్పుడు పేరిందేవి ప్రక్కనే ఉండి నాకు అన్నీ అందిచ్చి వడ్డించేది.

ఒకొక్కసారి జ్వరమొచ్చి ఇంట్లో పడుకునిఉంటే పేరిందేవి తనుకూడా స్కూలు మాని, నా దగ్గరే కూర్చునేది. మందు ఇచ్చి ఏవో కబుర్లు చెప్పేది. దొడ్లో ఎదురుగా ఉన్న జామచెట్టు, అందుమీది రామచిలుకలు, అరటితోట, నీటిపైపు, దానిమ్మ పువ్వులు వీటి గురించి మాట్లాడుకునే వాళ్ళం

ఆరవ ఏట నాకు మశూచి వచ్చింది. విపరీతంగా వ్యాపించిన మశూచి నా శరీర ఆకారం మార్చేసింది. శరీరంలో నునుపుతనం మాయమయి, గంట్లుదేరింది. మశూచి జ్వరంతో బాధపడేరోజుల్లో వాళ్ళఅమ్మ, నాన్న వద్దన్నా వినక పేరిందేవి నా ప్రక్కకు వచ్చి కూర్చునేది. వేప కొమ్మలతో విసిరేది.

"మీ అమ్మలా ఉంటుందిరా పేరిందేవి!" అనేవాడు నాన్న ఆ రోజుల్లో.

మా అమ్మ చనిపోయిన తొమ్మిదినెలలకు పేరిందేవి పుట్టడంవల్ల, అమ్మ పోలికలన్నీ ఆమెలో వున్నాయని నాన్న అనడంలో ఆయన

హృదయంలోని భావం ఏమిటాఅని నేను ఆలోచించక పోలేదు. కాని, నాకు అప్పుడు ఎక్కువ అర్థమయ్యేది కాదు. ఆ భావంలోని గూఢార్థం. కురూపిగా మారిన నన్ను స్కూల్లో అందరూ హేళన చేసేవారు పేరిందేవి ఈ హేళనలు చూసి ఒక్కొక్కసారి వాళ్ళని కసిరేది. ఎవరేమన్నా, నా స్నేహం విడిచేది కాదు. నాకు తొమ్మిది సంవత్సరాలు వచ్చాయి. ఒక రోజు నాన్న ఊరువెళ్ళి తిరిగి వచ్చాడు. ఆయన తో ఇరవై ఏండ్ల ఒక అమ్మాయి, ఒక ముసలాయన వెనకాలే వచ్చారు. వంటవాడు చేసిన భోజనం తిని, పేరిందేవి, నేను ఏవోకబుర్లు చెప్పుకుంటున్నాం స్కూలు పాఠాలు గురించి.

"ఒరేయ్ వేణూ!" నాన్న సరదగా పిలిచారు ఇంట్లోకి రాగానే.

పేరిందేవి ఆక్రొత్తవాంళ్ల వైపుచిత్రంగా చూస్తునిల్చుంది.

"నీకు క్రొత్త అమ్మను తీసుకువచ్చానురా" అన్నారు నాన్న.

ఆ క్రొత్త స్త్రీ నా దగ్గరకు చనువుగా వచ్చి నా తల నిమిరింది.

నేను తెల్లబోయి చూశాను.

పేరిందేవి నాచెయ్యి పట్టుకుని వెనక్కిలాగింది.

"క్రొత్త!" నవ్వారు నాన్న! నేను వెనక్కి తగ్గడం చూసి.

"అవు నవును"! ఆ ముసలాయన వెకిలిగా తల ఊపాడు.

నాన్న ఆ క్రొత్తవాళ్ళతో ఏదో మాట్లాడుతున్నారు. కులాసాగా.

పేరిందేవి నేనూ బయటికి వచ్చాము.

"మీ నాన్న పెళ్ళి చేసుకున్నారు!"

"ఆమె నీ సవతి తల్లి. జాగ్రత్త!" ఏదో మంత్రం ఉపదేశించి నట్లు పేరిందేవి నా చెవిలో గుసగుస లాడింది.

పేరిందేవి తన యింటికి వెళ్ళిపోయింది.

ఆ క్రొత్త మనుష్యుల మధ్య ఇల్లంతా నాకు క్రొత్తగా కనిపించింది. ఆ క్రొత్త స్త్రీ ఇంట్లో అడుగు పెట్టినప్పటినుంచి నాన్న నా అవసరాలగురించి శ్రద్ధ అట్టే తీసుకోవడం మానేశారు. నా సవతితల్లి నాకు కావలసిన బట్టలు, భోజనం అన్నీ యిచ్చేది. పేరిందేవి తరుచు మా యింటికి రావడం మానేసింది. ఒక సెలవు రోజున చాకలివాణ్ణి పిల్చుకురమ్మని సవతితల్లి ఉత్తరువు చేసింది. చెరువు గట్టువైపు వెడుతున్నా. రావిచెట్టు రివ్వున వీచె గాలికి రోద పెడుతూ నృత్యం చేస్తోంది.

"వేణూ!" వెనుకనుంచి కేక వినిపించింది.

ఆగాను. పేరిందేవి నేలమీద ఏదో వెదుకుతూ వచ్చింది.

"ఇక్కడ చెవి లోలకు జారిపోయింది. నీకు కనిపించిందా?"

నాకు తెలియదని తెలుసున్నా పిలిచి ఆ ప్రశ్న వేయడంలో పేరిందేవి ఉద్దేశ్యం నేను గ్రహించాను. ఆమెను కలుసుకుని చాలా రోజు లయింది. బడిమానేసింది. మా యింటికి రావడం కూడా బాగా తగ్గించింది. నన్ను పలకరించా లనుకున్న ఆమెతో పరిహాసం [illegible] పించింది.

"చెవి లోలకా?"

"అవును."

"బంగారంది కదూ?"

"అవును."

"కిందటిసారి నేను చూసేను అదేనా?"

"ఊ ఊ అదే"

"ఈ మాత్రం దానికి ఇన్ని ప్రశ్న లెందుకని?"

"ఆ చెప్తా. ఇంక దాణిక్కడే చూశాను. ఆ రాళ్ళక్రింద అనుకుంటా" గట్టిగా నవ్వాను. నేను అన్నది అబద్ధ మని ఆ నవ్వు చెబుతూనే వుంది.

పేరిందేవి ఆత్రుతగా రాళ్ళక్రింద వెదికింది. లోలకు కనిపించింది.

ఏదో మేజిక్ జరిగిందనుకుని తెల్ల మొహం వేశాను.

"సాయంత్రం మా యింటికి రా. మిఠాయి పెట్టిస్తా అమ్మచేత" అంటూ నవ్వుకుంటూ వెళ్ళిపోయింది పేరిందేవి.

సాయంత్రం పేరిందేవి యింటికి వెళ్ళాను. దొడ్లో మందార వృక్షాలకు నీళ్ళు పోస్తోంది పేరిందేవి. ఆమెలో ఒక సంవత్సరం నుంచి చాలా మార్పు కనిపించింది. అల్లరి, చిలిపితనం తగ్గించి నెమ్మది, పెద్దరికం నేర్చుకుంటున్నట్లనిపించింది. ఏపుగా ఎదిగిన ఆ మందార వృక్షం, ఆకు పచ్చ, పసుపు పచ్చని ఆకులతో, కుంకుమ రంగు పువ్వులతో నిండుగా గాలిలో ఊగుతున్న సోయగమంతా, పసుపుపచ్చని ముఖ కాంతిలో కుంకుమ తిలకం దిద్దుకున్న పేరిందేవిలో మూర్తీభవించినట్లనిపించింది.

"రా వేణూ! కూర్చో" అంటూ నీళ్ళకుండ మందార వృక్షం దగ్గరే వదిలి మెల్లిగా నా వైపు నడిచి వచ్చింది. వరండాల చాపవేసి కూర్చోమంది ఇట్లోకి వెళ్ళి ఒక పళ్ళెంలో మిఠాయి తెచ్చి ముందు పెట్టింది.

"బంగారు లోలకు చూపించ గలిగినందుకు, బంగారంలాటి మిఠాయి బహుమతి!" నవ్వింది పేరిందేవి.

"మా యింటికి రావడం మానేశా వేం?"

మళ్ళీ నవ్వింది పేరిందేవి.

"బడి మానేశా వేం?"

కిలకిల నవ్వింది పేరిందేవి.

"నేను మిఠాయి తింటున్నా."

"నాకు పెళ్ళట వేణూ!" సిగ్గుతో నవ్వింది,

ఆమె వైపు తేరిపార చూశాను.

"మీ నాన్న ఒక సంబంధం నిశ్చయించారు"

"ఎప్పుడు పెళ్ళి?"

"వచ్చే నెల!"

"అయితే నేను నీ పెళ్ళికి బ్యాండు వాయిస్తా" ఆనందం పట్టలేక గట్టిగా అన్నాను. ఆమె నవ్వింది.

ఏలా ఉంది మీ క్రొత్త అమ్మ?" ప్రశ్న వేసింది పేరిందేవి ముభావంగా.

"నాకు అదోలా ఉంది ఆమెతో మసలడానికి"

"ఆమెను చూస్తే నాకు భయం వేస్తుంది" పేరిందేవి ముఖం దించుకుంది.

"పెళ్ళి!" ఆ మాటతో నాకు అర్థమయింది ఆమె జీవితం మారుతోందని చిన్ననాటి స్నేహానికి ఆఖరు దశ వచ్చినట్లనిపించింది.

సంతోషం కోలుపోయిన మనిషిలా లేచి ఇంటికి వెళ్ళిపోయాను. పేరిందేవి పెళ్ళి జరిగింది. నాన్న చాలా హడవిడిగా ఉన్నారు. పెళ్ళి

రోజులో పెళ్ళి కొడుకుమాకు బంధువువే. స్ఫోటకం మచ్చలతో అంద వికారంగా ఉన్నాననినాతో పెద్దలు, పిన్నలు కూడా ఎక్కువ పరిచయం కలుగజేసుకోలేదు ఆ పెళ్ళిలో.

పెళ్ళయిన సాయంత్రం పెళ్ళి పందిరిలో కూర్చుని ఏదో అర్థం కాకుండా ఆలోచిస్తున్నా. మధువర్కంలో ప్రొద్దు తిరుగుడు పువ్వులా మెరుస్తున్న పేరిందేవి కుంకుమ భరిణితో ఎదురుగావచ్చి నిల్చుంది.

"కూర్చో" నేను లేచి నుంచున్నాను.

భరణిలోని కుంకుం తీసి నా ముఖానికి నామంపెట్టింది మౌనంగా. నాకుఏర్పడుతున్న దిగులుకు శ్రీరామ రక్షలా కనిపించింది. ఆ నామం.

నేనునవ్వాను. ఆమెనవ్వింది. ఇద్దరంమౌనంగా అయిదు నిమిషాలు కూర్చున్నాం. తర్వాత పేరిందేవి వెళ్ళిపోయింది ఇంట్లోకి.

పెళ్ళయినాక పేరిందేవి ఇంట్లోంచి ఎక్కువగా బయటకు వచ్చేది కాదు. వచ్చినా, ఆడవాళ్ళ మధ్య ఉండేది. ఎప్పుడైనా నేను కనిపిస్తే ఒక నవ్వునవ్వేది.

నా సవతితల్లి గర్భవతి అయింది. అప్పటికి నాజీవితంలోని అనాదరణ తిరిగి ఉధృతరూపంలో ప్రారంభ మయింది. నాన్న తన స్వంత పనులతో మునిగి తేలుతూ ఉండేవారు. సవతితల్లి సరిగాభోజనం పెట్టేది కాదు. ఎప్పుడు తనపిల్లలని ఎత్తుకుని త్రిప్ప మనేది. ఇంట్లో చాకిరీ అంతా చేయించేది. కురూపి అని తిట్టేది. ఆమె అదుపు ఆజ్ఞల్లో నా జీవితమే దుర్భరమయి పోయింది. నాన్న నా విషయం గ్రహించి ఒక్కొక్కసారి సవతితల్లిని కూత లేశేవాడు. అయినా నా బ్రతుకు మారలేదు.

పద్దెనిమిందేడ్లకే బి. ఏ పూర్తి చేసుకుని, ఉద్యోగం కోసం తారట్లాడుతున్నా?

"ఎంత కాలం ఆడదానిలా ఇంట్లో కూర్చోడం" ముసలి తండ్రి తెస్తూంటే మెక్కి తినడం తెల్సు"

సవతితల్లి ఒకరోజు రుస రుస లాడింది.

అటువంటి రుస రుసలు అనేకసార్లు విన్నా, పౌరుషం వచ్చింది. బ్రతుకు బాగు పడాలనుకుంటే సంకుచితవ్యక్తుల సంసార కూపం నుంచి నిష్క్రమించాలని పించింది. అంతే!

ఊళ్ళోవున్న పేరిందేవి దగ్గర అయిదు రూపాయలు బదులు తీసుకున్నా ఇల్లు విడిచిపోయాను.

కరుడుకట్టినకష్టాలు, మారిన ప్రయాణల్లో మాసిపోయాయి. చివరకు కలకత్తాలో స్థిర పడ్డాను. నాన్నకు ఉత్తరం వ్రాశాను. నేను ఇల్లు వదిలిపెట్టిన తర్వాత. నా మీద ఆయన చూపిన పూర్వ నిర్లక్ష్యం పూర్తిగా గ్రహించకోని పశ్చాత్తాపంతో ఆయన బాధపడుతూ ఉత్తరాలు వ్రాశారు. ఇంటికి రమ్మని ఒకసారి, సవతీతల్లి చనిపోయినదని వార్త వచ్చింది. నాన్నను చూడడానికి ఉదాసీనత్వం వహించాను .. ఈ నాడు సీత పెళ్ళి నాన్న వ్రాసిన బాధాత్మకమైన ఉత్తరం చూసి కలకత్తా నుంచి కదలకుండా ఉండలేక పోయాను.

వీధిలో బ్యాండువాళ్ళ ధ్వనులతో నా ఆలోచనలు చెదిరిపోయాయి. పెళ్ళి ముహూర్తంవచ్చింది కాబోలు అంటూ ప్రక్కమీంచి లేచాను.

పెళ్ళి పందిరిలో జనం గుమిగూడుతున్నారు. పురోహితులు మంత్రాలు వర్ణిస్తున్నారు. బెనారసు చీరతో పెద్ద ముత్తైదువులా భర్త

పక్క కూర్చున్న పేరిందేవి కన్యాదానానికి సిద్ధమైంది, నేను కంటితో చూడకపోయినా, ఫోటోలో చూచిన అమ్మ ఎదురుగా ప్రత్యక్షమయినట్లు కనిపించింది. ఆమె రూపంలో.

నన్ను కన్నతల్లి నా జననంతోటే చనిపోయింది. నాకు పాలిచ్చి పెంచిన దాసి పాము కాటుతో చనిపోయింది. నా మాతృ స్థానం ఆక్రమించిన సవితి తల్లి నా బాధల ఉసురుతో చచ్చిపోయింది. నాకు మాతృమూర్తిలా కనిపిస్తున్న పేరిందేవి...ఆ శుభ సమయంలో నా చెడు ఆలోచనలకు నన్ను నే తిట్టుకున్నా.

బ్యాండు, సన్నాయి ధ్వనులలో లీనమయి నా ఆలోచనలు మర్చిపోయేను. పెళ్ళి పందిరిలో జనమంతా సందడిగా ఉన్నారు. నాన్న హడావడిగా, క్రొత్త బట్టలు, తాంబూలాలు అందిస్తూ వచ్చిన బ్రాహ్మణులకు సంభావనలు ముట్టచెబుతున్నారు. నా సవతితల్లి తమ్ముండ్లు ఇద్దరూ పెళ్ళి పందిరలో జనానికి సెంటు రాస్తూ, పన్నీరు చల్లుతున్నారు,

పెండ్లి పూర్తయింది. పెళ్ళిపీటలమీంచి భార్యాభర్తలు లేచినాన్నకు నమస్కరించారు. పేరిందేవి కూడా దంపతులను ఆశీర్వదించింది.

"వేణూ!" పేరిందేవి పిలిచింది.

వెళ్ళాను. దంపతులు నాకూ నమస్కరించారు. నాన్న ఒక్కసారి పేరిందేవివైపు తేరిపార చూసి, నావైపు తిరిగి, కన్నీరులో తల దించుకున్నారు. ముభావంగా పెళ్ళిపందిరలోంచి నిష్క్రమించాం మేం తర్వాత ఇంట్లోకి వెళ్ళి పరున్నా నేను.

ప్రయాణపు అలసటలో హైరానపడయిన నాకు తెల్లవారుజాము చల్లగాలిలో బాగా నిద్రపట్టింది

మర్నాడు తొమ్మిది గంటలైనా నిద్రబద్దకం వదలలేదు. ప్రక్క మీద దొర్లుతూ మండుతున్న కళ్ళతో జోగుతున్నా.

"వేణూ! ఇంకా లేవలేదూ?" రాత్రి సరిగా నిద్రలేక ఎరుపెక్కిన కండ్లతో, అలసటతో, పాలిపోయిన ముఖంతో పేరందేవి ప్రత్యక్షమయింది. అమె చేతిలో కాఫీ, ఉప్మా కనిపించాయి.

"ఇవి చల్లారిపోకుండ ముఖం కడుక్కునిరా" కసిరినట్లు ముఖం చిట్లించింది పేరందేవి.

తల్లి ఆజ్ఞ పాలించే పిల్లవాడులా త్వరగా ముఖం కడుక్కుని వచ్చాను. ఉప్మానుంచి కమ్మని వాసనలు నాసికలో దూరి గజిబిజి చేశాయి.

"చాలా శ్రమపడుతున్నావు" ఫలహారం ఆరగించ మొదలెట్టాను.

"శ్రమ కాదు! సరదా!"

"ఇంత చిన్నతనంలో పెళ్ళి పెద్దరికాలు నీకెందుకు?"

"కావాలని కోరాను. మీనాన్న ఒప్పుకున్నారు."

నీ పిల్లల నందర్నీ చూపించావు కాదు."

"ఈ రోజు గడిచిపోనీ! అంతా తీరుబడే...నీతో యింకా మాట్లాడే విషయాలు చాలా ఉన్నాయి" నవ్వింది పేరిందేవి.

"అలాగా?" ఏమిటో ఆశ్చర్యంగా ఆమెవైపు చూశాను.

మరుక్షణంలో గబ గబ మేడకిందకు వెళ్ళిపోయింది ఆమె.

మధ్యాహ్నం భోజనాలకు పెండ్లి పెద్దలు, ఇరుగుపొరుగుజనం గుమి గూడారు, అందరూ నన్ను పరామర్శించారు. కొందరు నేను బ్రతికిఉన్నానో లేదో అనే అనుమానంతో కొంచెం కంగారుగా నాకేసి చూశారు—ఎవరీ వ్యక్తి అని, కల కత్తాలో ఏంచేస్తున్నావంటూ, ఎంత జీతమంటూ కొందరు పెద్దలు ఆరా తీశారు. "ఇంకా పెళ్ళి చేసుకోవేం?" అంటూ కొందరు సిద్ధాంతులు మత ప్రవక్తల్లా "అది అధర్మం" అంటూ తీర్మానించ బోయారు మా "ఆమ్మే" బ్రతికి ఉంటే వీళ్ళందరకి ఈ ప్రశ్నల అవ కాశం లభించేదికాదేమో అనిపించింది.

సాయంత్రం పెండ్లికూతురు, పెండ్లికొడుకు బంతులాడారు. 'వేణూ!' అని నన్ను పిలిచి, బలవంతముగా తీసుకువెళ్ళి ఆడవాళ్ళమధ్యలో కూర్చొ బెట్టి వాళ్ల ఆట చూడమంది పేరిందేవి.

రాత్రి ఎనిమిది గంటలకు భోజనంచేసి కిళ్ళీ వేసుకుందామని బజా రువైపు నడిచాను. వెన్నెల చిమ్ముతున్న వీధిలో కొంగుపరుచుకొని, బిచ్చ కత్తె ఒకతె తన బిడ్డను అదుముకుంటూ హాయిగా గుర్రుపెట్టి పడుకుంది. పాలు త్రాగుతున్న తనపిల్లల శరీరం ఆఘ్రాణిస్తోంది. ఊరకుక్క తన పిల్లలను కరువబోయిన నల్లకుక్కపై లంఘించి ఉరికింది ఒక వరాహం,

ఆకాశంలో ఏవో ఏవో పిట్టలబారులు తల్లి పిల్లల గుంపులుగా కదిలేయి. నీచ మనుకొనబడే ప్రతిజీవి కూడా మాతృప్రేమ ఏదోవిధంగా అందుకుని ఆనందిస్తోంది. కిల్కీయిచ్చిన దుకాణదారుణ్ణి "భోజనానికి రా నాయనా?" అంటూ తల్లి యింట్లోంచి తొందరచేస్తింది. కన్న తల్లి ముఖమే ఎరుగని నాస్థితి తల్చుకోగా ఆవేదనఉప్పొంగింది.

మర్నాడు మధ్యాహ్నానికి ఇల్లు కొంచెం ఖాళీఅయింది. పెండ్లికి వచ్చిన బంధువులు క్రమంగా ప్రయాణ సన్నాహాలు చేసుకున్నారు. వారికి వీడ్కోలు బాధ్యత నాన్నమీద వదిలేసింది పేరిందేవి

మధ్యాహ్నం భోజనమయ్యాక తీరుబడిగా వరండాలోకి వచ్చి కూర్చున్నా. ఎదురుగా కనిపించిన పేరిందేవి భర్త, వెంకట్రావు కలకత్తా లోని నా జీవితస్థితిగతులపై పరిశోధనలు మొదలుపెట్టాడు. ఇంతలోనే పేరిం దేవి తన ముగ్గురిపిల్లల్ను వెంటబెట్టుకుని తాంబులాలు నములుతూ వరండా లోకి వచ్చింది.

"చూశావా వేణూ! నా సంతానం?"

"ముగ్గురు పిల్లలూ వనసతోనల్లా మెరుస్తున్నారు అన్నా."

"శశి, బాబు, నీలం! ఎల్లావున్నాయి పేర్లు?" అంది పేరిందేవి.

"దివ్యంగా వున్నాయి" నవ్వాను.

"నా బాబు నీ అంత తెలివైనవాడు కావాలి" పేరిందేవి బాబును ముద్దు పెట్టుకుంది

"నేనుపాడైపోయిన మనిషిని, నాగుణాలు ఎవరికీ రావద్దు" అన్నా.

"ఆ సంగతి నిర్ణయించవలసింది మేము" నవ్వింది పేరిందేవి.

బాబును ఎత్తుకున్నా. అయిదేళ్ళ బాబు నాకేసిచూస్తూ చంద మామ వెన్నెల్లా నవ్వులు కురిపించాడు.

నా దృష్టి బాబు హస్తంమీదికి పోయింది. రేఖలు తడిమాను సాము ద్రికుని సాధారణ అలవాటు ప్రకారం.

"సాముద్రికం నేర్చావా?" పేరిందేవి ప్రశ్నించింది, అది గమ నించి.

"ఒంటరితనం సుళువుగా గడపాలని నేర్చుకున్నాను."

"అయితే నా చెయ్యిచూడు" పేరిందేవి హస్తంచాచింది.

"ముందు నా చెయ్యి చూడండీ" వెంకట్రావు పేరిందేవి చెయ్యి ప్రక్కకు తోసేశాడు.

ఈ గడబిడ విన్న పెద్ద ముత్తైయిదువులు "ఏమిట్రా" అంటూ నా చుట్టూ మూగారు. సాముద్రికం మీద సరదా పెరిగి అందరూ తమ చేతులు చూడమంటూ నన్ను వేధించారు.

వెంకట్రావు చెయ్యి చూశాను. "మీకుత్వరలో ఒక పెద్ద ఆఫీసరు ఉద్యోగం దొరుకుతుంది" అన్నా ఆనందంతో ఉక్కిరిబిక్కిరిఅయి ఏవో వగటికలల్లోలీనమై పోయాడు వెంకట్రావు. అతని చెయ్యి చూశాక పేరిం దేవి చెయ్యి తప్పక చూడాలనిపించింది.

నా ఉద్దేశ్యం ఇట్టే గ్రహించినట్లు అడిగింది పేరిందేవి. "నేను ఐదవ తనంతోటే చనిపోతానా?"

"ఏమిటా ప్రశ్న?" వెంకట్రావు కసిరాడు.

మెదడులో ఏదో బెదురు కలిగింది. పేరిందేవి ప్రశ్నకు "ఊ" అని ఊరుకున్నా.

నా సవతి తల్లి నా ఎదురుగావచ్చి అడిగింది:

"నా కొడుకు చేతుల్లో వెళ్ళిపోతానో లేదో కొంచెం చెప్ప వేణూ!"

"మరేం పర్వాలేదు" అని ఆమెకు ధైర్యంచెప్పాను.

"కొడుకు చేతుల్లో పోతేనే మాతృదేవతకు సంతోషం. నే చనిపోయే టప్పటికి బాబు పెద్దవాడవుతాడో లేదో!" పేరిందేవి మెల్లిగా నమిలింది మాటలు.

"పెళ్ళి జరిగిన ఈ యింట్లో ఏమిటి ఈ అశుభం మాటలు!" కసిరాడు వెంకట్రావు.

"నా చెయ్యి చూడు అన్నయ్యా!" అంటూ పెండ్లి కూతురు సీత దగ్గరగా వచ్చింది.

"నీకు మొట్టమొదట ఆడపిల్ల పుడుతుంది" అన్నా.

"ఛా! ఏమి టిది?" అంటూ చెయ్యి లాక్కుంది సీత.

"ఇదంతా సాముద్రికమా?" పేరిందేవి నవ్వింది.

"సంఘటనలు జరిగితే కాని, సాముద్రికం విలువ తెలియదు" నా మాటకు నవ్వుతూ ఊరుకుంది పేరిందేవి.

బంధువులను సాగనంపి నాన్న వరండాలోకి వచ్చారు.

"ఏమిటి ఈ వరండాలో సభ?" నాన్న నవ్వుతూ పరీక్షగా అందరివైపు చూశాడు

"సాముద్రిక గోష్టి! మీ భవిష్యతు తెలుసుకోండి" ప్రచారం చేసే ఏజెంటులా నాన్నకు విజ్ఞప్తి చేసింది పేరిందేవి.

"జీవితం ఆఖరయే రోజుల్లో ఇంక భవిష్యతు ఏముంటుంది?" విచారంతో ఒక నిట్టూర్పు విడిచి కుర్చీలో కూర్చున్నారు. నాన్న.

ఒక నిమిషం అందరిలో నిశ్శబ్దం.

ఆ నిశ్శబ్దం పేరిందేవి ఛేదించింది.

"వేణూ! నీ పెళ్ళి ఎప్పుడు?" నాన్న హృదయంలోని ప్రశ్న అర్థం చేసుకున్నట్లు పేరిందేవి నన్ను ప్రశ్నించింది.

నాన్న నాకేసి ఆసక్తిగా చూశారు నా సమాధానం కోసం.

"ఏమో!" నసిగాను నాన్నకేసి కొంచెం భయంగా చూస్తూ.

"మా భవిష్యత్తు చెప్పగలిగిన సాముద్రికుడు తన భవిష్యత్తు చెప్పుకోలేడంటే హాస్యాస్పదం!" నవ్వింది పేరిందేవి.

మరో క్షణం ఉంటే ప్రశ్న పరంపరలు అందరినోటినుంచి బాణాల్లా నామీదకు వస్తాయని గ్రహించాను. ఆ సభనుంచి నిష్క్రమించడం ఉత్తమం అనుకుంటూ, మౌనంగా హఠాత్తుగా లేచి మేడమీదకు వెళ్ళిపోయాను ఒంటరిగా నా స్థితి గ్రహించిన నాన్న మరోమాట మాట్లాడకుండా టేబుల్ మీద ఉన్న భాగవతంపుస్తకంతీసి పేజీలు తిరగ వేశారు కాలక్షేపానికి అమ్మలక్కలు క్రమంగా వరండాలోంచి నిష్క్రమించవలసిన పరిస్థితి ఏర్పడింది.

మర్నాడు ప్రొద్దున్నే కలకత్తా వెళ్ళిపోతానంటూ నాన్నకు మనవి చేశాను. మరో రెండు రోజులు ఉండమన్నారు నాన్న. కాని ఈ పరిస్థితుల్లో మనస్తాపమే కాని ఆనందం లేదని గ్రహించుకున్న నేను కలకత్తా ప్రయాణం స్థిరపరచాను.

పేరిందేవి ప్రొద్దున్నే నాకు ఫలహారాలు తెచ్చి మౌనంగా, ఎదురుగా కుర్చీలో కూర్చుంది.

చికాకుగా ఫలహారాలు అందుకున్నా.

"కోపం వచ్చిందా?" ప్రశ్నించింది. పేరిందేవి.

నిన్నటి వరండాలోని సభ గుర్తుకు వచ్చింది. 'లేదు' నవ్వాను.

"ఇంక ఎప్పుడూ అడగను నీ పెండ్లి సంగతి!"

ముఖం దించుకుంది పేరిందేవి.

"అసలు ఈ జీవితం ఎలా గడిపినా ఒకటే అనిపిస్తోంది. అందుచేత జీవితాన్ని కుదిరిచే నియమాలు ప్రత్యేకం సృష్టించుకోడం అవసరమనిపిస్తోంది. భౌతిక ప్రపంచ గమనం పరిశీలించి అర్థంచేసుకున్న వారికి ఒక మనిషి బ్రతుకు ఏమయినా ఫర్వా లేదనిపిస్తుంది!"

పేరిందేవి ప్రశ్నకు నే నిచ్చిన సమాధానం విని అసంతృప్తితో, ముఖం ముడుచుకుంది. ఆమె!

"బాగుంది!" ఒకనిట్టూర్పువిడిచింది ఆమె.

రైలుస్టేషను దాకా నాన్న, పేరిందేవి వచ్చారు. నన్ను సాగనంపడానికి. నా జీవితంమీద నాలో ఏర్పడిన నిర్లిప్తత, నిర్లక్ష్యం—నాన్న, పేరిందేవి కూడా అవగాహనం చేసుకున్నట్టు నేను గ్రహించాను.

కాలం పరుగు తెలియని కలకత్తా బ్రతుకులో నాల్గు ఋతువులు కరిగిపోయాయి, ఒక రోజు పొద్దున్న కాఫీ ముగించుకుని, వార్తాపత్రిక చదువుతూ కూర్చున్నాం. టెలిగ్రాం వచ్చింది.

వెంకట్రావు కుటుంబంతో బయలుదేరి కలకత్తా వస్తున్నాడు స్టేషనకు రమ్మని తంతి.

వివరాలు తెలియక వెంకట్రావు ఆకస్మిక ఆగమనం అర్థంచేసుకో లేక పోయాను. పైగా అతను కుటుంబంతో వస్తున్నాడనగానే అనేక ఆలోచనలు సుడిగాలిలా మెదడులో విజృంభించాయి. గది బయటి వరండాలోకి వచ్చి సిగరెట్టు పీలుస్తూ గాలి పీల్చుకున్నా వెంకట్రావు ఆగమనం తలుచు కుంటూ.

నాల్గు అంతస్థుల మేడమీద నుంచున్న నాకు రోడ్డుమీద జన ప్రవాహం, బస్సుల సందడి, వార్తా పత్రికలు అమ్మే కుర్రవాళ్ళ గోల, ప్రతీమూల ప్రస్ఫుటంగా, వయ్యారంగా నిలబెట్టిన సినీమాల చిత్రపటాలు, ఆ నగర వాతావరణం, ఇంతవరకు జీవితంలో చవిచూచిన యాంత్రిక ప్రవర్తన గుర్తుకు వచ్చాయి. పది గంటల ప్రొద్దు కావస్తున్నా సూర్యుని అడ్డుతూ నిలుచున్న అంతస్థులమేడల రహదారిని నీడల్లో ముంచి ఇంకా శీతలంగానేవుంచాయి. దూరాన కనిపించేవెలుగు పన్నెండు గంటలవుతే గాని రహదారిని వెచ్చపరిచేలా లేదు. ఎదురు మేడమీద ఒక ప్రౌఢ స్నానంచేసిన శిరోజాలు ఆరవేసుకుంటోంది. ప్రక్క గదిలోని బంగాలీవం తులుగారిపిల్లలు రణగొణధ్వనిచేస్తున్నారు. నా గదిలో టేబిలుమీది గాజు గొట్టంలో నిలుచున్న పూలగుత్తులు ఎదురుగా ఉన్న తెల్ల గోడల్ని చూసి నా కర్థంకాని భాషలో ఏదో పేలవంగా నవ్వాయి.

పెరిందేవి మళ్ళీకనిపిస్తుంది. శశి...బాబు...నీలం...వెంకట్రావు! ఇల్లు కలకల్లాడుతుంది ఒక కుటుంబంతో. ఇంతకాలం తన్నుచూసి భయంతో బ్రతుకుతున్న ప్రక్క-సంసారులు నాకూకొందరు బంధువులున్నా రని తెలుసుకుని సన్నిహితులు కావచ్చు......ఆలోచిస్తూ గదిలో గడి యారంవైపు చూశాను. పది మీద నిలుచున్న చిన్న ముల్లునుతక్షణం ఆరుమీదికి త్రిప్పెయ్యాలని పించింది. గడియారంమీదకి దండయాత్ర చేసిన నా చెయ్యి మళ్ళీ మెల్లిగా తిరోగమనం చేసింది.

సాయంత్రం ఆరుగంటలకల్లా రావలసిన కలకత్తా మెయిలు అర గంట ఆలస్యంగా వస్తుందని ప్రకటించాడు. రైల్వే ఉద్యోగి మెయిలు కోసం నిరీక్షిస్తూ పచార్లు చేశాను. ప్లాట్ ఫారం మీద. తేనెటీగల్లా ప్లాట్ ఫా రంమీద తిరుగుతున్న జనం గుంపులు గతించిన తరాల ప్రస్తుత చిహ్నాలుగా కనిపించాయి. మరో తరానికి మళ్ళీ యీ చిహ్నాలుమారి పోతాయి.

నా జీవితంనుంచి మరో తరం ఉద్భవించకుండా బలవంతగా అన కట్ట కట్టుకున్నా నన్న బాధ చిన్ని మబ్బు చాటు నీడలా మనస్సులో కదిలింది. మాతృత్వం ఎరిగిన అమ్మైతేంటే నా ఒంటరి జీవితం సహించేదా? "ఇంక ఎప్పుడూ అడగను నీ పెళ్ళి సంగతి" అన్న పెరిందేవి మాటలు జ్ఞప్తికి వచ్చాయి. అమ్మ బ్రతికి ఉంటే అమ్మ ముఖం అంత బాధతోనే కనిపించేదేమో.

మెయిలు రాగానే వెంకట్రావు కుటుంబంతో సహా దిగాడు, పెరిం దేవి "కులాసాగా ఉన్నావా వేణూ" అంటూ పలకరించింది, వెంకట్రావు నవ్వుతూ షేక్ హేండు ఇచ్చాడు. పిల్లలు క్రొత్త వల్ల నన్ను వింతగా చూసి, విచిత్రంగా ఏంతోరద్దీగావున్న ఆ రైలుస్టేషన్ వైపు చోద్యంగా తల త్రిప్పారు.

ఒక టాక్సీ పిలిపించి అందర్నీ యింటికి తీసుకు వచ్చాను. దారిలో కలకత్తా వీధుల సొగసు చూడడంతోనే నిమగ్నులైపోయారు పేరిందేవి, వెంకట్రావు.

ఇంట్లో అడుగుపెట్టి ఇల్లంతా చోద్యంగా పరిశీలిస్తూ, నవ్వుతూ బడలికగా సోఫాలో వాలింది పేరిందేవి.

"మీరు అదృష్టవంతులండీ" వెంకట్రావు అన్నాడు.

"ఏం?"

"ఇంతకాలం ఈ నగరంలో సరదాగా జీవితం గడుపుకుంటున్నందుకు."

"మీకూ పట్టిందిగా ఆ అదృష్టం" పేరిందేవి భర్తను వెక్కిరించింది.

"నాతోపాటు నీకూను" నవ్వాడు వెంకట్రావు.

"వేణూ! ఏమనుకోకు సుమా! అసలు సంగతి చెప్పనే లేదు. ఈయనకు ఈ ఊళ్ళో ఒక కార్ల కంపెనీలో అసిస్టెంటు మేనేజర్ ఉద్యోగం దొరికిందిలే నువ్వు ఇక్కడే ఉన్నావనే ధైర్యంతో అంతా కుటుంబంతో వచ్చేశాము. నువ్వు చెప్పిన సాముద్రికం నిజమయింది వేణూ."

"చాలా సంతోషం. మీరంతా ఇక్కడే ఉండిపోవచ్చు" అన్నా.

"నువ్వు అంటే మాత్రం ఉండొద్దూ కొన్నాళ్ళు ఇక్కడ తర్వాత వేరే కాపురం.

"ఇళ్ళు దొరకవద్దూ?"

"నువ్వు వున్నావుగా" పేరిందేవి నవ్వింది. నవ్వుతూనే లేచి తక్కిన గదులన్నీ తనిఖీ చెయ్యాలని ముందుకు నడిచింది. అతిథులు కూర్చునే గదికాక మరొక పడక గది. చిన్న వంటిల్లు మాత్రం ఉన్నాయి. వంటింట్లో చిందరవందరగా గిన్నెలు, కుంపటి. ప్రక్కనే నేలమీద వ్యాపిస్తున్న బూడిద, దాసీది మధ్యాహ్నం రాకపోవడంవల్ల అన్నం తిన్న వెండి కంచం కనిపించాయి.

"వేణూ వంట చేసుకుంటున్నావా?" ఆశ్చర్యం, బాధ, ఆలోచనతో పేరిందేవి ముఖంమీద ఒక నవ్వు వెలిసింది.

"మన తెలుగు భోజనం కలకత్తాలో దొరకడం కష్టం కదూ! అప్పుడప్పుడు రుచికోసం వండుకుంటుంటాను!" "ఇదా నువ్వు చేస్తున్న పని" అన్నట్లు చుర చుర చూసింది నాకేసి పేరిందేవి. వెంకట్రావు వార్తా పత్రిక తిరగవేస్తున్నాడు. సోఫాలో కూర్చుని పిల్లలు పడకగదిలో వున్న అలమరులోని తెలుగు, ఇంగ్లీషు పుస్తకాలు, మేగజైనులు గడబిడగా తీసి గల్లంతుగా బొమ్మలు చూస్తున్నారు.

"వేణూ! నేను ఇంత త్వరలో ఇక్కడికి వచ్చేదాన్ని కాదు. కాని నీ పరిస్థితులు తనిఖీచేసి, నీ జీవితంలో ఏమైనా మార్పు తీసుకురాగలనేమో అని ముందే వచ్చి కూర్చున్నా. ఇంత బరువుతో యీ కుటుంబం నీ ఇంట్లో కూర్చుందని నువ్వేమీ అనుకోవు కదూ."

మీరంత రావడం నాకు చాలసంతోషంగా ఉంది. ఇంట్లో ఒంటరిగా గడిపేనాకు ఇప్పుడు ఎంతో సందడి! ఇంతకన్నా కావాలసిన మార్పేముంది. నా జీవితంలో నువ్వు రావడంతోటే మార్పువచ్చేసింది.

"అది కాదయ్యా! వేణూ! ఈ కలకత్తాలో మంచి బెంగాలీ పిల్లని ఎవరినైన వెదికి నీకు పెళ్ళిచేసేస్తా" అంటూ పకపక నవ్వింది పేరిందేవి.

"అంత పనిమాత్రం చెయ్యకు. వాళ్ళ నాన్నకు కోపం వస్తుంది" అన్నాడు వెంకట్రావు.

"వాళ్ళ నాన్న వేణూ విషయంలో ఎంత బాధ పడుతున్నాడో మీకేం తెల్సుని?" పేరిందేవి వదనం గంభీరమయింది.

"ఈవేళ మీ భోజనం హొటలునుంచి" విషయం మార్చాను.

పేరిందేవి ఒక్క నిమిషం తలదించుకుని, ఆలోచనగా నిట్టూర్చి నవ్వింది.

'అయితే కలకత్తా హొటలు పాకం అన్నమాట!'

అందరూ నవ్వారు.

రాత్రి భోజనాలయినాక పిచ్చాపాటీ, ఎన్నోకబుర్లు దొర్లాయి.

మర్నాడు వెంకట్రావు ఉద్యోగంలో చేరాడు.

వారం రోజులు గడిచాయి.

ఇంట్లో ఏదో క్రొత్త కళ ప్రవేశించినట్లయింది. ఇంటి గుమ్మాలకు కిటికీలకు కొత్త తెరలు రంగులతో వూగులాడుతున్నాయి. గదిలోని మునుపటి బోడి గోడలమీద ప్రకృతి చిత్రాలు సొగసుగా నిలుచున్నాయి. అలమరులోని పుస్తకాలు బూజుపోయి నిగ నిగ లాడుతున్నాయి. ఎక్కడ ఉండవలసిన బట్టలు, వస్తువులు, అక్కడ హాజరుగా కనిపించాయి. వేళకు రుచికరమైన ఫలహారం, కమ్మనీ భోజనం తయారవుతున్నాయి. వీటివల్ల నాకు శరీరంలోనూ, మనస్సులోనూ ఎంతో ఆరోగ్యం కలిగినట్లయింది.

పేరిందేవికి కలకత్తా జీవనం కొంచెం వింతగా వుంది. వీధిలోకి కూరలకు వెళ్ళివచ్చేటప్పుడు కనిపించే బెంగాలీ, పార్సీ, ఆంగ్లో ఇండియన్, గుజరాతీ, స్త్రీల నడతలు, భాషలు గురించి రోజుకొక కథ చెప్పేది

పేరిందేవి తమవాళ్ళతో హిందీలో ఎట్ల విచిత్రంగా మాట్లాడింది. వాళ్ళు ఆనతో చనువుగా ఎలా సంభాషించింది హాస్యంగా వర్ణించి కడుపుబ్బ నవ్వించేది మమ్మల్ని. వీలున్నప్పుడు సాయంత్రం పిల్లల్ని నగరంలోకి తీసుకవెళ్ళి కాలక్షేపం చేసేవాడిని. ఒక్కొక్కసారి పేరిందేవి దంపతులతో సినిమాకు వెళ్ళి ఆనందించేవాణ్ణి.

నాల్గు నెలలు గడిచినా వెంకట్రావుకు తగిన అద్దె యిల్లు దొరకలేదు. నా యింట్లోనే వుండి పొమ్మని పేరిందేవికి, వెంకట్రావుకు మరీ మరీ చెప్పా అయినా ఆ మాట వెంకట్రావుకు నచ్చలేదు.

పేరిందేవి తన పిల్లలకు ఎంత రక్షణ చేసేదో, అంత సంరక్షణా నా విషయంలో కూడ చూపించినా, ప్రతివాని జీవిత గతులు ఒక నిర్ణీత రీతిలో పోతాయన్న విషయం ఋజువై పోయింది.

ఒక రోజు బాగా తలనొప్పిగా ఉండి జ్వర నలవరం ఉందనుకుని ఇంటికి వచ్చి పడుకున్నా. వారం గడిచినా జ్వర తీవ్రతతగ్గ లేదు. జ్వరం పరీక్షించి డాక్టరు కొంచెం కంగారు పడ్డాడు. చివరకు టైఫాయిడు జ్వరమని నిర్ణయించాడు.

పేరిందేవి తల్లడిల్లిపోయింది. తమ ఇంట్లో అడుగు పెట్టాక నాకు ఈ రోగం రావడం ఆమెకుచాలా బాధ కలిగించింది. బంధువులు తాను సరిగా చూడలేందంటారనే నెపంఅటుంచి, చిన్నప్పటి నుంచి తల్లి లేకపోవడంవల్ల సరైన సంరక్షణ లేని నాకు అభిమానంతో ప్రత్యేకం సంరణక్ష చేయాలని వచ్చిన పేరిందేవి చెప్పలేని వ్యధతో కుమిలి పోయినట్లు కనిపించింది. రాత్రింబవళ్ళు నిద్ర, ఆహారం సరిగా లేక, నాకు మందులు, ఖత్తా

యిలు అందిస్తూ, నల నల కాగే శరీరానికి చల్లగాలి యిచ్చేలా విసురుతూ, తలనొప్పితో విజృంభించే జ్వరంతో పగిలిపోయే నా శిరానికి మంచుగడ్డల రబ్బరు తిత్తి ఒత్తుతూ, నేను విడిచిన ప్రతి వేడి శ్వాసకు, మూల్గుకు, కుమూలుతూ పేరిందేవి చేసిన సేవ తల్లయినా చేస్తుందో చెయ్యదో అనిపించింది.

నలభై రోజులు గడిచాయి. నన్ను నక్కలా చెసి జ్వరం విడిచింది. ఎముకల పోగు శరీరంలా, గెడ్డం పెంచుకుని నీరసంగా పడుకున్న నా ఆకారం నాకే విచిత్రమనిపించింది. జ్వర తీవ్రతలో పేరిందేవిని పరిశీలించలేదు. కాని, ఇప్పుడు చూస్తే ఆమె మునుపటి కంటె సగం చిక్కిపోయింది.

ఆ రోజు పత్యం పెట్టారు. నాకోసం వెంకట్రావు సెలవు పెట్టి పేకాటతో కాలక్షేపం చేదామని ఇంట్లో ఉండిపోయాడు.

"మీరు చేసిన సేవ మర్చిపోలేదు. నేను ఒంటరిగా ఉండగా ఈ జ్వరం వస్తే ఏమయ్యేవాడినో!" అన్నా.

"జ్వరం తగ్గి కులాసాగా ఉన్నావు. మా కంతే చాలు" అన్నాడు వెంకట్రావు. భర్త మాటకు ఎక్కువ చెప్పవలసిన అగత్యం లేక పేరిందేవి వూరుకుంది.

"కొంతకాలం ఒకరి కొకరం కనిపించకపోయినా నా జీవితంలో ఏదో విధంగా అమ్మలా సేవ చేస్తోంది పేరిందేవి. అమ్మలా అనేక సలహాలిచ్చింది. అమ్మలా అనేకసార్లు ఆదరించింది అసలు ఆకృతిలోనే మా అమ్మలా కనిపిస్తుంది" అన్నా పేరిందేవి కంటికి కొలకుల్లో కన్నీరు నుంచుంది. ఆమె పెదిమలు హాయిగా నవ్వాయి.

బత్తాయిపండు ఒలిచి చేతిలో పెట్టింది పేరిందేవి.

"ఈ పండులో స్వతస్సిద్ధంగా ఎంత రుచిఉందో తెలియదు కాని ఇది నీహస్తంతో యివ్వడంవల్ల నాకు చాలా మధురంగా ఉంది" తొనలు తింటూ నవ్వాను. పేరిందేవి నవ్వింది. పేకముక్కలు కలిపింది. నేను మరో రెండు నెలలు సెలవు తీసుకున్నా. నా అనారోగ్యం కారణంచే వెంక ట్రావు మరో అద్దె యిల్లు వెతుక్కోలేదు.

ఒక రోజు సాయంత్రం అయిదు గంటలయింది. వేడి హార్లిక్సు తీసుకుని మేగజైను తిరగవేస్తున్నా.

పేరిందేవి వెండి పళ్ళెంలో కొబ్బరికాయలు, అరటిపళ్ళు, పువ్వులు కుంకుమ, పసుపు పెట్టుకుని ఎదురుగా వచ్చి నిలుచుంది.

నా కర్థం కాలేదు.

"వేణూ! నేను కాళీ దేవాలయానికి వెళుతున్నాను. ఆయనకు కాఫీ, ఫలహారాలు వంటింట్లో పెట్టాను" అంటూ నవ్వింది పేరిందేవి.

మా బసకు ఒకమైలు దూరంలో కాళికాదేవి ఆలయం ఉంది. నగరం రద్దీలో మర్రిచెట్టుక్రింద వీధిమొగలో నిలుచున్న ఆ గుడికి వెళ్ళా లని ఎప్పుడూ ఆమె ఆసక్తి చూపించలేదు. ఈ వేళ ఎందుకు వెడుతుందో నా కర్థం కాలేదు.

"ఏమిటి విశేషం?" నవ్వాను.

"ప్రక్క యింటి బెంగాలీవాళ్ళు వెడుతున్నారు. నేనూ వెడ దామని" నమిలేసింది పేరిందేవి.

"సరే" అన్నా. ఆ విషయం యింక ఎక్కువ తల పెట్టలేదు.

రాత్రి ఎనిమిది గంటలకు ఇంటికి వచ్చింది పేరిందేవి. చేతిలో కుంకం పొట్లం విప్పి "వేణూ! ఇది బొట్టు పెట్టనీ" అంది పేరిందేవి.

దైవం గురించి ఎక్కువగా ఎప్పుడూ చింతించని నాకు ఆ కుంకుమలో నమ్మకం లేకపోయినా పేరిందేవి వాత్సల్యంతో అడిగిందని ఒప్పుకున్నా,

కుంకంతో ఒక సన్నని నామం పెట్టింది. ఆమె నాకు నా ఆరోగ్యానికి రక్షగా ఆ నామం కనిపించింది అద్దంలో.

"కాళీ గుడికి ఎందుకు వెళ్ళావు?" ప్రశ్నించాను పేరిందేవి. ఆమె నవ్వి పూరుకుంది.

"నాకు ఒంట్లో బాగులేనప్పుడు మొక్కు కున్నావా?" అవునన్నట్లు అంగీకారంగా నవ్వింది పేరిందేవి. నవ్వుతూ, చకచకా వంటింట్లోకి వెళ్ళిపోయింది. ఆమె స్వీయ మాతృదేవతను ఎరుగని నాకు మాతృమూర్తి ఎదురుగా సాక్షాత్కరించి నట్లయింది. ఉప్పొంగిన ఆమె వాత్సల్యం నాకు ఆనందసాగరమైంది నన్ను ముంచి తేల్చింది. అంత ఆత్మీయత ప్రదర్శించే మనుష్యులు జీవితంలో అరుదుగా సంఘటితమవుతారు అనుకున్నా.

నేను బాగా ఆరోగ్యవంతుడనై ఉద్యోగంలోచేరి మామూలుగా తిరుగుతున్నా. ఇంటిదగ్గర శిస్తులు తెచ్చుకుని, నల్గురి బంధువులనీ చూసి వస్తాననీ వెంకట్రావు పది రోజులు సెలవు తీసుకుని స్వంతవూరు వెళ్ళాడు.

నాలుగు రోజులు గడిచాక ఒక ఆదివారం ప్రొద్దున మామూలుగా కాఫీ త్రాగి పేపరు చదువుతున్నా వంటింట్లోంచి దబ్బున ఒక పెద్ద శబ్దం వినిపించింది. ఆశ్చర్యపోయి వంటింట్లోకి చూశాను తడిబట్టతో అప్పుడే స్నానం చేసివచ్చిన పేరిందేవి హఠాత్తుగా క్రింద పడిపోయింది. చేతిలో ఉన్న నీళ్ళచెంబు జారిపల్టీలుకొట్టి, సొట్టలుపడి నీరమంతా క్రింద ఒలకపోసి నేలంతా తడిచేసింది. బలంగా నేలమీద పడ్డ ఆమె చేతుల గాజులు పగిలీ ముక్కలయ్యాయి మెడలో ఉన్న మంగళసూత్రం చాచుకుని నేల మీదకు జారింది.

మాటలేక, స్పృహలేక, చలనం లేక పడిపోయిన పేరిందేవి చూడగానే నాకు టైఫాయిడ్ జ్వరం నాటి నీరసం ఆవరించినంత పనయింది. దగ్గరకు వెళ్ళి తట్టా అయినా చలనం లేదు. పిల్లలు చిత్రంగా కంగారుగా తెల్లబోయి చూస్తున్నారు. పరుగెత్తుకుని క్రిందకు వెళ్ళి డాక్టరుగారిని తక్షణంరమ్మని ఫోనుచేశాను. డాక్టరువచ్చి చెప్పాడు:

"పేరిందేవి గుండె హఠాత్తుగా ఆగిపోయి చచ్చిపోయిందని?" నాకు ముచ్చెమటలు కమ్మాయి. పిల్లలు ఏడ్పులతో తల్లి చుట్టూ మూగారు. ప్రక్కయింటి బెంగాలీలు సానుభూతితో పరుగెత్తుకు వచ్చారు. ఏమైతేనేం "పేరిందేవి ఇంక బ్రతకదని రూఢి అయిపోయింది.

తక్షణం వెంకట్రావుకు టెలిగ్రాం యిచ్చాను.

సాయంత్రానికి ఒక కవరు, ఒక టెలిగ్రాం వచ్చాయి. తనతండ్రి తల్లి చనిపోయిందని, తాను దహనక్రియలు చేయవలసి రావడంవల్ల యింకా పదిహేను రోజులు దాకా రాలేనని, వీలైతే పేరిందేవిని పంపమని టెలిగ్రామం ఇచ్చాడు. వెంకట్రావు అతనికి నా టెలిగ్రామ్ అంది

నట్లు లేను. "ఇంకెక్కడి పేరిందేవి?" శోకం ఆగక ఏడ్చాను. వెంక ట్రావు వచ్చేమార్గం లేక, మాతృదేవతలాంటి పేరిందేవికి కొడుకులా దహన క్రియలు నేనే చేశాను.

కవరులో నాన్న వ్రాసిన ఉత్తరం ఉంది. నేను టైఫాయిడ్ జ్వరం తగ్గక ఆరోగ్యంగా ఉన్నందుకు సంతోషిస్తూ వ్రాశారు. నేను బ్రతికి ఉన్నానని తండ్రి ఆనందించారు, కాని నేను బ్రతకడమే పేరిందేవిని బలి కోరినట్లు అనుపించింది నాకు.

పేరిందేవిని కాళికాదేవి గుడికి వెళ్ళిన సన్నివేశం నా కళ్ళముందు కట్టింది. నా హృదయం వ్యథతో కరిగిపోయింది. కన్నతల్లిని చూడలేక పోయిన నాకు మాతృమూర్తిలా ఉన్న పేరిందేవి చివరికి ప్రాణదానంచేసి నిజంగా నాజీవితంలోని మాతృదేవత అయింది.

పేరిందేవి తన పిల్లలను పెద్ద కొడుకులా నాకు అప్ప చెప్పినట్లని పించిది. తల్లి పోయిందని విలపిస్తూ అమాయక హృదయాలలో అర్థం కాని బెంగతో అలమటిస్తున్న ఆ పిల్లల్ని చూసి జాలిపడ్డా. ఒక నెల రోజులు సెలవుపెట్టి పిల్లల్ని వెంకట్రావు స్వంతవూరు తీసుకువెళ్ళా.

తండ్రి లేకపోవడ వల్ల చనిపోయిన అమ్మకు వెంకట్రావే అంత్య క్రియలు చెయ్యవలసివచ్చి ఆవూరు వదిలి తక్షణం కలకత్తా రాలేక పోయాడు అతను.

అత్యంతమైన అభిమానంతో అందాలరాశి అని భార్యని పూజించె టంతస్థితిలో ఉండేవెంకట్రావు భార్య మరణవార్త విని ఒక నిమిషం కొయ్యబారి పోయాడు నేనూ, పిల్లలురాగానే గొల్లుమని ఏడ్చాడు నన్నుచూసి, పిల్లలు బిత్తరపోయి బిక్కముఖం వేశారు.

నెలరోజులు వెంకట్రావు అతని పిల్లలతో అక్కడే గడిపి, నాన్నను చూడాలని మావూరు వెళ్ళాను. నాన్న నన్నుచూసి ఎంతో ఆనందించాడు అరోగ్యంగా హాయిగా ఉన్నానని, మాచెల్లెలు సీత నెలగర్భంతో ఉందని ఆనందవార్త అందిచ్చాడు నాన్న నాకేదో హఠాత్తుగా మనస్సుకు తట్టింది. "సీతా! క్రిందటిసారి నీకు సాముద్రికం చెప్పా ఆడపిల్ల పుడుతుందని జ్ఞాపకముందా.?"

"జ్ఞాపకముంది" సిగ్గుపడింది సీత.

"నా సాముద్రికం నిజమైతే నే కోరినట్లు చేస్తావా?"

"చెప్పు" ఆశ్చర్యంతో నాకేసిచూచింది.

"పేరిందేవి అని పేరు పెట్టు" అన్నా.

"మీ అమ్మపేరు కదూ!" అంది సీత.

"అవును, మా అమ్మపేరు! నా జీవితంలో కనిపించిన నిజమైన మాతృమూర్తి పేరుకూడా."

ప్రక్కనే నిలుచుని వింటున్న నాన్న చకితులయ్యారు. తర్వాత ఏదో సర్దుకుని నెమ్మదించినట్లు కనిపించారు.

"పెట్టమ్మా! అలాగె పేరు పెట్టు!...కనకమ్మగారు ప్రసవించినప్పుడు నేను వాళ్ళింట్లోనే వున్నాను. పుట్టగానె వాళ్ళ ఆడపిల్లకు పేరిందేవి అని నేనే మొదట నామకరణం చేశాను. నా మాట త్రోసివెయ్యలేకవాళ్ళ అమ్మా అదే పేరు పెట్టారు కనకమ్మగారు నేను పెట్టిన పేరు సార్థకమైంది పేరిందేవి ముమ్మూర్తులా మీ అమ్మలాగే కనిపించేది వేణూ!" నాన్న కంట తడి పెట్టారు.

సంధ్యారుణ సమయం దాటి చీకట్లు అలముకున్నాయి పూరంతా. నాన్నను, సీతను వదిలి ఒంటరిగా ఒక నిమిషం గడపాలని డాబామీదకు పచారుకు వెళ్ళాను.

సీతకు చెప్పిన సాముద్రికం నిజమవుతుందనే దృఢవిశ్వాసం నాలో కలిగింది. ప్రబలమైన మమతలతో మరణించిన మా అమ్మ తరాలు గడిచినా నాకోసం తనువు దాలుస్తుందనే వెర్రి నమ్మకం కల్గింది. హృదయంలోని ఆవేదనతో వేడి కన్నీరు విడిచాను.

శిరస్సుమీద దూరంగా ఉన్న నిశ్శబ్ద నిశీథ ఆకాశంలోని చుక్కల గుంపులు గతించిన తరాల ప్రత్యక్ష చిహ్నాలుగా గోచరించాయి. ఒక వెలుగుచుక్క వేగంగా రాలింది. రాలుతూ జ్వాజ్వల్యమానంగా ఆ వెలుగు నా హృదయంలోకి ఒక ఆనంద రేఖలా ప్రవేశించింది.